సాక్షి
నంద్యాల
మంగళవారం । 25 । ఫిబ్రవరి । 2025



చిన్నారులకు 'సత్వర చికిత్స'
కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని బాలల సత్వర చికిత్స కేంద్రం చిన్నారుల పాలిట వరంగా మారింది. పుట్టుకతోనే వ్యాధుల బారిన పడిన చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. 8లో▸



.. బాలికలు భళా
బనగానపల్లె జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు జాతీయ ఉపకార వేతన పరీక్షలో సత్తా చాటారు. ఏకంగా 16 మంది అర్హత సాధించి ఔరా.. అనిపించారు. 8లో▸



మహానందికి బ్రహ్మోత్సవ శోభ
మహానంది క్షేత్రంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ఈఓ ఆధ్వర్యంలో వేదపండితులు అంకురార్పణ పూజలు నిర్వహించారు. 8లో▸

న్యూస్‌రీల్

ప్రతి అర్జీని సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ రాజకుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు ఆదేశాలిస్తున్న కలెక్టర్ రాజకుమారి

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి అర్జీని ఆయా శాఖల అధికారులు సమగ్రంగా విచారణ చేసి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల పర్యవేక్షణకు శ్రీశైలం వచ్చిన కలెక్టర్ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సున్నిపెంటలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో ఆమె మాట్లాడారు. రీ ఓపెన్ అయిన దరఖాస్తులను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర మంత్రుల నుంచి వచ్చిన అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. పీ4 సర్వే, మిస్సింగ్ హౌస్‌హోల్డ్ డాటా, ఎంఎస్‌ఎంఈ సర్వే, చిన్నపిల్లల ఆధార్ అప్‌డేట్‌లను మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని పారామీటర్లలో బనగానపల్లె, బేతంచెర్ల, శిరివెళ్ల మండలాలు వెనుకబడి ఉన్నాయని, ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సర్వేలు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

బీసీ గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

- 600 మంది విద్యార్థులకు 5వ తరగతిలో ప్రవేశాలకు అవకాశం

నంద్యాల(న్యూటౌన్): మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతిలో ప్రవేశానికి ద 2025–26 విద్యా సంవత్సరానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న తొమ్మిది పాఠశాలల్లో 600 మంది విద్యార్థుల ప్రవేశానికి అవకాశం లభించింది. ఈ నెల 15 నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో స్వీకరించేందుకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. హెచ్‌టీటీపీఎస్://ఎంజేపీ ఏపీబీసీడబ్ల్యూఆర్ ఈఐఎస్.ఏపీసీఎఫ్‌ఎస్ఎస్.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్, పాణ్యం ఎంజేపీఏపీబీసీ సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ ఫ్లోరమ్మ తెలిపారు. సీట్ల కేటాయింపులో రిజర్వేషన్లను పరిగణలోకి తీసుకుంటారన్నారు. మార్కుల ఆధారంగా మెరిట్ లిస్టు మొదటి, రెండవ, మూడవ జాబితాను ఖాళీలను బట్టి ప్రకటిస్తారన్నారు.

మోడల్ స్కూళ్లలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని 20 మోడల్ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ జనార్దన్‌రెడ్డి ఒక ప్రకటనలో సోమవారం పేర్కొన్నారు. ఏప్రిల్ 20వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈనెల 25వ తేదీ నుంచి మార్చి 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు.

పింఛన్లకు రూ.195.28 కోట్లు మంజూరు

కర్నూలు(అగ్రికల్చర్): ఎన్‌టీఆర్ పెన్షన్ కానుక కింద మార్చి నెలకు ఉమ్మడి జిల్లాలో 4,53,829 పింఛన్లకు రూ.195.28 కోట్లు మంజూరయ్యాయి. ఫిబ్రవరి నెలతో పోలిస్తే మార్చిలో 1,095 పింఛన్లపై కోత పడింది. ప్రభుత్వం పింఛన్ల పంపిణీ నిధులను ఈ నెల 28న బ్యాంకులకు విడుదల చేస్తుంది. మార్చి 1న ఉదయం 6 గంటల నుంచి సచివాలయ ఉద్యోగులు పింఛన్లు పంపిణీ చేయనున్నారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి

కర్నూలు కల్చరల్: ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల్లోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) నూతన డివిజనల్ మేనేజర్ జి.లక్ష్మీనారాయణ అన్నారు. ఇప్పటి వరకు డీవీఎంగా ఉన్న చంద్రమౌళీశ్వర్ రెడ్డిని ఏపీటీడీసీ రాష్ట్ర కార్యాలయానికి బదిలీ చేశారు. ఆ స్థానంలో లక్ష్మీనారాయణ డీవీఎంగా నియమితులయ్యారు. సోమవారం వెంకటరమణ కాలనీలోని టూరిజం కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాల్లో సౌకర్యాలు మెరుగుపరిచి సందర్శకుల సంఖ్య పెరిగేందుకు చర్యలు చేపడతామన్నారు. గార్గేయపురం చెరువు బోటింగ్ పాయింట్‌లో రోలింగ్ బోట్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. నూతన డీవీఎంకు ఉర్దూ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ షావలిఖాన్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

శివ శివ శంకర.. భక్తవ శంకర!

'శ్రీశైల వాసా.. భక్త జన ప్రియా.. పాహిమాం.. పాహిమాం' అంటూ భక్త కోటి మల్లన్న చెంత ప్రణమిల్లుతోంది. నల్లమల గిరుల్లో ఓంకార నాదం ప్రతిధ్వనిస్తోంది. ఇల కైలాసం భక్తజన సంద్రాన్ని తలపిస్తోంది. శ్రీశైలంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు నేత్రానంద భరితంగా సాగుతుండగా భక్తి భావం ఉప్పొంగుతోంది. పాతాళ గంగలో భక్తుల పుణ్యస్నానాలు.. నిష్ఠగా శివ స్వాముల ఆరాధనలు.. శాస్త్రోక్తంగా సాగుతున్న ఉత్సవ క్రతువులతో బ్రహ్మోత్సవాలు రమణీయంగా కొనసాగుతున్నాయి.



స్వామి అమ్మవార్లకు పూజలు చేస్తున్న పండితులు



గ్రామోత్సవాన్ని తిలకిస్తున్న భక్తజనం

- శోభాయమానంగా శివరాత్రి బ్రహ్మోత్సవాలు
- పుష్పపల్లకీలో దేవదేవుళ్ల విహారం
- స్వామిఅమ్మవార్లను దర్శించుకుని పరవశించిన భక్తజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీగిరిలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు సోమవారం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు పుష్పపల్లకీలో విహరిస్తూ దేదీప్యమానంగా భక్తులకు దర్శనమిచ్చారు. క్షేత్ర పుర వీధుల్లో నిర్వహించిన పుష్పపల్లకీ గ్రామోత్సవంలో లక్షలాది మంది భక్తులు పాల్గొన్నారు. పుష్పపల్లకీని వివిధ రకాల సుగంధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆసీనులు చేశారు. ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పల్లకీ సేవలో పాల్గొని తరించారు. భక్తజనవాహిని ఉత్సవ మూర్తులను కనులారా దర్శించి కర్పూర నీరాజనాలు సమర్పించింది. గంగాధర మండపం నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం నందిమండపం, బయలు వీరభద్రస్వామి ఆలయం మీదుగా రాజగోపురం వరకు సాగింది. జానపద కళాకారుల నృత్య ప్రదర్శనలు, డ్రమ్స్, డప్పులు, తప్పెట్లు, మేళతాళాలు, భజంత్రీలు, శంఖానాదాల కోలాహలం నడుమ గ్రామోత్సవం నేత్రానందభరితంగా సాగింది. ఆయా పూజల్లో శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు మంగళవారం సాయంత్రం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు గజ వాహనసేవ, గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహిస్తారు.



ఉత్సవంలో నందికోలు సేవ



భక్తులకు అన్నదానం చేస్తున్న దాతలు





పాదయాత్రగా శ్రీగిరికి చేరుకుంటున్న భక్తులు

శ్రీశైలం.. శివమయం

శివభక్తులతో శ్రీగిరి నిండిపోయింది. ఎటు చూసినా శివభక్తుల భజనలు, శివనామస్మరణలు, పూజలతో శ్రీగిరి క్షేత్రం మారుమోగుతోంది. బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. నల్లమల అటవీ ప్రాంతం మీదుగా భక్తులు పాదయాత్రగా వస్తున్నారు. వృద్ధులు, మహిళలు, చంటిపిల్లల తల్లులు సైతం ఎండను లెక్క చేయకుండా కదలివస్తున్నారు. పాతాళ గంగలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, కృష్ణమ్మకు వాయనం సమర్పిస్తున్నారు. అనంతరం క్యూలైన్ల వద్దకు చేరుకుని శ్రీశైల మల్లన్న దర్శనానికి వెళ్తున్నారు. భక్తుల రద్దీతో ఆలయ క్యూలైన్లన్నీ నిండిపోయాయి.

భక్తులకు ఉచిత లడ్డూ ప్రసాదం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బ్రహ్మోత్సవాల్లో ఉచిత లడ్డూ ప్రసాదం పంపిణీ చేస్తున్నారు. ముఖ్యమైన రోజులైన సోమవారం, మంగళవారం, బుధవారం, గురువారం క్యూలైన్లలో స్వామిఅమ్మవార్లను దర్శించుకున్న భక్తులకు అమ్మవారి ఆలయం వెనుక గోపురం వద్ద ఉచిత లడ్డూ ప్రసాదం అందజేస్తున్నారు.

ఇరుముడి విప్పితే.. సమర్పించాల్సిందే!



శివదీక్ష శిబిరంలో దీక్ష విరమణ చేస్తున్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: శివ దీక్ష భక్తులు దోపిడీకి గురవుతున్నారు. అత్యంత భక్తి శ్రద్ధలతో 41 రోజుల పాటు శివమాల స్వీకరించిన భక్తులు దీక్ష విరమణకు ఇరుముడితో శ్రీశైలానికి తరలివస్తున్నారు. దీక్ష విరమణకు దేవస్థానం ప్రత్యేకంగా శివదీక్ష శిబిరాలను ఏర్పాటు చేసింది. స్థానిక ఆగమ పాఠశాలకు చెందిన సుమారు 106 మంది విద్యార్థులను మూడు విడుతలుగా విధులు కేటాయించారు. వీరికి ప్రత్యేక గుర్తింపుకార్డులను సైతం అందించారు. అయితే ఆగమ పాఠశాలలో గతంలో చదివిన వారు, ఆగమ పాఠశాలలో పనిచేసే వారికి పరిచయం ఉన్న కొందరికి సైతం గుర్తింపు కార్డులను ఇచ్చి ఇరుముడి విరమణ చేసేందుకు అనుమతించారు. వీరిలో కొందరు భక్తుల నుంచి దక్షిణ రూపంలో డిమాండ్ చేస్తున్నారు. దీక్ష విరమణ పూర్తయిన తరువాత భక్తులు తోచినంత ఇస్తే అర్చకులు స్వీకరించాలి. అలా కాకుండా కచ్చితంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇరుముడి విరమణ చేస్తే కచ్చితంగా రూ.100, ఆపై ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు పలువురు భక్తులు ఆరోపిస్తున్నారు. 'ఏంటి స్వామి ఇలా డిమాండ్ చేస్తున్నారు' అని భక్తులు ప్రశ్నిస్తే 'మేము ఇచ్చుకునేవి ఉన్నాయని' బదులిస్తున్నట్లు శివభక్తులు ఆరోపిస్తున్నారు. శివదీక్ష శిబిరాలను పర్యవేక్షించాల్సిన దేవస్థానం అధికారుల నిర్లక్ష్యంతో భక్తులు దోపిడీకి గురవుతున్నారు.

చెరువులకు నీళ్లు ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వం

- హంద్రీ నీవా నీరు చెరువులకు తరలింపులో నిర్లక్ష్యం తగదు
- 90 శాతం పనులు వైఎస్సార్‌సీపీ పాలనలోనే పూర్తి
- పైప్‌లు చోరీకి గురవుతున్నా పట్టించుకోరా?
- మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి



పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న మాజీ మంత్రి

ప్యాపిలి: కూటమి ప్రభుత్వం చెరువులకు నీళ్లు ఇవ్వలేని అసమర్థ పాలన సాగిస్తోందని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి విమర్శించారు. గుడిపాడు చెరువుతో పాటు పైప్ లైన్‌లో ఓ పైపును దుండగులు అపహరించిన ప్రాంతాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం గుడిపాడులో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా చెరువులను నింపే కార్యక్రమం చేపట్టామన్నారు. 2024 ఎన్నికల కోడ్ వచ్చేనాటికి 90 శాతం పనులు పూర్తి చేశామన్నారు. మరో నెలరోజులైతే అన్ని చెరువులు జలకళను సంతరించుకుని రైతులు ఈ పాటికి రెండు, మూడు పంటలు తీసేవారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలైనా ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్న పది శాతం పనులు పూర్తి చేయలేక ఆపసోపాలు పడుతుందని విమర్శించారు. దీనిని బట్టి రైతుల పట్ల ప్రభుత్వానికి, స్థానిక పాలకులకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉందో తెలుస్తోందన్నారు. డోన్ నియోజకవర్గంలోని దాదాపు అన్ని గ్రామాలకు తమ హయాంలో రోడ్డు సౌకర్యం కల్పించామన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రోడ్లకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలు కూడా తొలగించలేని పరిస్థితిలో ఉందన్నారు. డోన్‌లో వంద పడకల ఆసుపత్రి దేశంలోనే ఎక్కడా లేని విధంగా నిర్మించామన్నారు. కనీసం ఈ ఆసుపత్రిలో రగ్గులు, బెడ్‌షీట్లు కూడా ఇప్పటి వరకు ఇవ్వలేక పోయారని విమర్శించారు. కంబగిరి స్వామి ఆలయం, మద్దిలేటి స్వామి ఆలయాల అభివృద్ధి పనులను కొనసాగించలేక పోవడం బాధాకరం అన్నారు. గుండాల చెన్నకేశవ స్వామి ఆలయ నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

పైపుల దొంగలను పట్టుకోవడంలో విఫలం..

గుడిపాడు చెరువుకు నీటిని సరఫరా చేసే పైప్‌ను దుండగులు అపహరించడం హేయమైన చర్య అని మాజీ మంత్రి బుగ్గన అన్నారు. దాదాపు 3–4 టన్నుల బరువు ఉన్న పైప్‌ను గ్యాస్ కట్టర్‌తో కత్తిరించి లారీలో తరలించినా పోలీసులు గుర్తించలేక పోయారన్నారు. కనీసం ఈ వ్యవహారంలో దుండగులను పట్టుకుని శిక్షించడంలో జాప్యం ఎందుకు జరుగుతుందని ప్రశ్నించారు. డిపార్ట్‌మెంట్ తలచుకుంటే, పాలకులకు చిత్తశుద్ధి ఉంటే దొంగలను పట్టుకోవడం ఎంతసేపు అన్నారు. బుగ్గన వెంట రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, జెడ్పీటీసీ సభ్యులు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, గుడిపాడు సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీ వెంకటరామిరెడ్డి, ప్యాపిలి ఉప సర్పంచ్ గడ్డం భువనేశ్వర్ రెడ్డి. వైఎస్సార్‌సీపీ నాయకులు మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, బోరెడ్డి పుల్లారెడ్డి, బొర్రా మల్లికార్జునరెడ్డి, బోరెడ్డి రాము, రాజా మురళీకృష్ణ ఉన్నారు.

కందిపప్పు.. ఇస్తే ఒట్టు

- నామమాత్రంగా కందిపప్పు పంపిణీ
- జిల్లాలో 5.34 లక్షల రేషన్ కార్డులు
- ఫిబ్రవరి నెల కేటాయింపు 2.16 లక్షల కిలోలు మాత్రమే
- సగం మందితో సరిపెడుతున్న వైనం



ఎండీయూ వాహనం ద్వారా అందజేస్తున్న రేషన్ సరుకులు

గోస్పాడు: కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో రేషన్ దుకాణాల ద్వారా కార్డుదారులకు కందిపప్పు, పంచదార, జొన్నలు, గోధుమపిండి, రాగులు.. తదితర సరుకులు ప్రతి నెలా అందిస్తామని చెప్పిన పాలకుల మాటలు నీటిమూటలవుతున్నాయి. రేషన్ కార్డుదారులకు బియ్యంతో సరిపెట్టేస్తున్నారు. పూర్తి స్థాయిలో కందిపప్పు ఊసే లేదు. ఇక చక్కెర కూడా అరకొరగా పంపిణీ చేస్తున్నారు. నిత్యావసర సరుకుల ధరలు బహిరంగ మార్కెట్లో ఆకాశన్నంటుతున్నాయి. ఈ సమయంలో పౌర సరఫరాల శాఖ అధికారులు పంపిణీ చేయాల్సిన కందిపప్పును కంటితుడుపుగా ఇస్తున్నారు. దీంతో కార్డుదారులు మార్కెట్‌లో అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఫిబ్రవరి నెల పూర్తిస్థాయిలో రేషన్ సరుకులు అందక కొందరు బియ్యంతోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో 5,34,293 రేషన్ కార్డులు ఉన్నాయి. జిల్లాకు ఫిబ్రవరి నెలకు సంబంధించి 6,600 మెట్రిక్ టన్నుల బియ్యం, 2,16,000 కిలోల కందిపప్పు, 2,13,000 కిలోల చక్కెర కేటాయించినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. దీంతో వినియోగదారులందరికీ సవ్యంగా కందిపప్పు, చక్కెరను అందించలేకపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణాల్లో కార్డుదారులకు కొంత మేర అందుతున్నా.. గ్రామీణ ప్రాంతాల్లో పంపిణీ పూర్తిగా తగ్గిపోతుంది. కేవలం కొద్ది మందికే ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. బహిరంగ మార్కెట్‌లో పట్టణ ప్రాంతాల్లో కిలో రూ.110 నుంచి రూ.120, పల్లెలలో రూ. 120 నుంచి రూ. 140 వరకూ విక్రయిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం ఎండీయూ వాహనాల్లో కందిపప్పును పూర్తి స్థాయిలో ఇవ్వక పోవటంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. కిలో కందిపప్పు రూ.67కే ఒక్కో కార్డుదారునకు అందించాల్సి ఉంది. కానీ ముందుగా రేషన్ తీసుకున్న వారికి మాత్రమే కందిపప్పు అందుతుందని కార్డుదారులు చెబుతున్నారు. జిల్లాలో రేషన్ కార్డుల సంఖ్యకు అనుగుణంగా కేటాయించకపోవడంతో అరకొరగా పంపిణీ చేస్తున్నారు.



కందిబ్యాళ్లు

డీడీలు కట్టని డీలర్లు...

బియ్యం పూర్తి స్థాయి కోటాకు ముందుగానే డీడీలు చెల్లిస్తున్నా డీలర్లు కందిపప్పు, చక్కెరకు మాత్రం ముందుకు రావడం లేదు. కార్డుల సంఖ్యకు అనుగుణంగా డబ్బులు కట్టినా ఆ మేరకు కేటాయింపులు లేకపోవడంతో గ్రామాల్లో పంపిణీ సమస్య తలెత్తుతుందని వెనుకడుగు వేస్తున్నారు. అలాగే కందిపప్పుకు అధిక మొత్తం చెల్లించాల్సి రావడం ఒక కారణం కాగా.. బ్లాక్ మార్కెట్‌కు తరలించి అమ్ముకునే ఆలోచన ఉన్నా నాణ్యత లేకపోవడంతో మిన్నకుండిపోతున్నారనే చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో పూర్తి స్థాయిలో కందిపప్పు వినియోగదారులకు చేరటం లేదనే విమర్శలు వెల్లువెత్తున్నాయి.

ఆలస్యంగా వెళ్తే లేదంటున్నారు



రేషన్ సరుకుల్లో ఇవ్వాల్సిన కందిపప్పు ఒక్కో నెల ఇవ్వడం లేదు. రేషన్ వాహనం ఒక్కో ప్రాంతానికి ఒక్కోరోజు వస్తుండటంతో ముందు వెళ్లిన ప్రాంతాలకు మాత్రమే కందిపప్పు అందుతుంది. ఆలస్యంగా వచ్చిన వారికి మాత్రం అందే పరిస్థితి లేదు. ఇదేమిటని అడిగితే స్టాకు ఉన్నంత వరకు ఇస్తామని చెబుతున్నారు. – మద్దిలేటి, జిల్లెల్ల

మార్కెట్‌లో అధిక ధరకు కొంటున్నాం



రేషన్ సరుకులు పూర్తిస్థాయిలో పంపిణీ చేయడం లేదు. మార్కెట్లో కందిపప్పు కొనలేని పరిస్థితి నెలకొంది. రేషన్ సరుకు ద్వారా తీసుకునే కందిపప్పుకు, మార్కెట్లో కొనుగోలు చేసే కందిపప్పుకు కిలోకు రూ.50 అధికంగా చెల్లించి తీసుకోవాల్సి వస్తుంది. – చెన్నయ్య, పసురపాడు

శాస్త్రోక్తంగా నారసింహస్వామి దీక్ష విరమణ

ఆళ్లగడ్డ: 41 రోజులు నియమ నిష్టలతో కఠోరమైన దీక్ష చేపట్టిన అహోబిల లక్ష్మీనారసింహ స్వామి భక్తులు సోమవారం భక్తి శ్రద్ధలతో దీక్ష విరమణ చేశారు. దీక్ష చేపట్టి మండలం పూర్తి కావడంతో దీక్ష విరమించేందుకు భక్తులు సుదూర ప్రాంతాల నుంచి ఇరుముడి కట్టుకుని కాలినడకన అహోబిలం క్షేత్రం చేరుకున్నారు. తెల్లవారు జామున ఎగువ, దిగువ అహోబిల ఆలయాల వద్ద పుణ్యస్నానాలు ఆచరించి కాలినడకన మాలోల లక్ష్మీనరసింహస్వామి సన్నిధికి చేరుకుని ఇరుముడి సమర్పించి దీక్ష విరమించారు. అనంతరం వేదపండితులు ఆలయ సమీపంలో నిర్వహించిన సుదర్శన హోమంలో పాల్గొన్నారు. దీక్షాపరులతో పాటు వారి కుటుంబ సభ్యులు తండోపతండాలుగా తరలిరావడంతో అహోబిలం క్షేత్రం గోవింద నామస్మరణతో పులకించి పోయింది.



సుదర్శన హోమంలో పాల్గొన్న భక్తులు

మయూర వాహనంపై మహానందీశ్వరుడు



మయూర వాహనంపై కొలువైన మహానందీశ్వరుడు

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ మహానందీశ్వరుడు సోమవారం రాత్రి మయూరవాహనంపై కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మయూరవాహనంపై కొలువైన మహానందీశుడికి గ్రామోత్సవం కనులపండుగగా సాగింది. వేలాది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తరించారు. కార్యక్రమాల్లో ఏఈఓ ఎరమల మధు, ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రూ.4 లక్షల నగదు అపహరణ

- పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించిన బాధితులు


పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించిన బాధితులు

పత్తికొండ రూరల్: పొలాన్ని విక్రయించగా వచ్చిన రూ.4 లక్షల నగదు బైక్‌లో పెట్టుకుని అత్త, అల్లుడు సోమవారం పత్తికొండ అంబేద్కర్ కూడలిలో ఓ హోటల్ వద్దకు టిఫిన్ చేసేందుకు వెళ్లారు. బైక్‌లో ఉంచుకున్న రూ.4లక్షల నగదును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుని వెళ్లడంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. బాధితులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని పెద్దహుల్తి గ్రామానికి చెందిన బోయ వరలక్ష్మి పొలాన్ని యాటకల్లు కురువ చిరంజీవికి విక్రయించింది. ఈరోజు పొలం విక్రయ నగదు ఇస్తామని మధ్యవర్తిగా ఉన్న పత్తికొండ పెట్రోలు బంకు సమీపంలోని దూదేకొండ గ్రామానికి చెందిన ఈడిగ జయప్రకాశ్‌గౌడు ఇంటి వద్దకు పిలిచి రూ.4 లక్షలు డబ్బు ఇచ్చారు. డబ్బు తీసుకుని ఆమె అల్లుడు బోయ వెంకటేష్‌తో కలిసి బైక్ ముందున్న ట్యాంకు బ్యాగులో పెట్టుకుని పత్తికొండలోని అంబేద్కర్ కూడలిలో ఉన్న ఓహోటల్ వద్ద టిఫిన్ తినేందుకు వెళ్లారు. అక్కడ నిలబడి ఉండగా బైక్ బ్యాగులోని నగదును అక్కడే పథకం ప్రకారం మాటువేసిన గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుని వెళ్లారు. దీంతో బాధితులు పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించారు. సీఐ జయన్న పోలీసు సిబ్బందితో దుండగుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

ఆటోలు ఢీకొని ఒకరి మృతి

- మరో నలుగురికి గాయాలు

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు–లొద్దిపల్లె రహదారిలో రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరో నలుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన కుమ్మరి వినోద్‌కుమార్ తన ఆటోలో కర్నూలుకు బయలుదేరాడు. వెల్దుర్తి మండలం పుల్లగుమ్మికి చెందిన హరికృష్ణ తన ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుని కర్నూలు నుంచి స్వగ్రామం పుల్లగుమ్మికి బయలుదేరాడు. మార్గమధ్యలో నన్నూరు సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన వినోద్ కుమార్, వెంకటలక్ష్మమ్మ, షేక్ సలీంబాషా, రమిజాబీ, లొద్దిపల్లెకు చెందిన పోతురాజు దాసు(45) గాయపడ్డారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోతురాజు దాసు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సునీల్ కుమార్ తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


మద్యం చూపుతున్న ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి

కోసిగి: మండల పరిధిలోని ఆర్లబండ గ్రామానికి చెందిన వందగల్లు వీరేష్ అనే వ్యక్తి అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా దాడులు చేసి పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆర్లబండ గ్రామ పరిసరాల్లో పర్యటిస్తుండగా వందగల్లు వీరేష్ 576 ఒరిజనల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లతో పట్టుబడినట్లు తెలిపారు. వీటి విలువ రూ.23,040 ఉంటుందన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ కార్తీక్ సాగర్, హెడ్‌కానిస్టేబుల్ కె.నాగరాజు, డి.కిశోర్ కుమార్, కానిస్టేబుల్స్ మునిరంగడు, భరత్, రవి పాల్గొన్నారు.

చిన్నారులకు సత్వర చికిత్స

పుట్టకతో వచ్చే 30 రకాల వ్యాధులకు వైద్యం

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక చొరవ
- అప్పట్లోనే పోస్టులన్నీ భర్తీ
- ప్రతి నెలా 2వేల మందికి చికిత్స
- మెరుగైన వైద్యంతో కోలుకుంటున్న చిన్నారులు

అమ్మా నాన్న, కుటుంబ సభ్యులు తప్ప ఆ చిన్నారులకు మరో లోకం తెలియదు. పాపం, పుణ్యం అనే పదాలకు అర్థమే తెలియని వయస్సు. ఈ భూమి మీదకు వచ్చేలోపు వారితో పాటే వ్యాధులూ వెంట వస్తూ జీవితాంతం వేదిస్తున్నాయి. ఇలాంటి పిల్లలకు మేమున్నామంటూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలోని బాలల సత్వర చికిత్స కేంద్రం/డిస్ట్రిక్ట్ అర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్(డైస్) వైద్యసేవలు అందిస్తోంది. పుట్టుకతో వచ్చే 30 రకాల జబ్బులు, దీర్ఘకాలిక సమస్యలున్న చిన్నారులను గుర్తించి అవసరమైన వైద్యచికిత్సలు అందిస్తూ సాధారణ స్థితికి తీసుకొస్తోంది.



పిల్లలకు చికిత్స చేస్తున్న పీడియాట్రిషన్

కర్నూలు(హాస్పిటల్): కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్‌లో భాగంగా బాలల సత్వర చికిత్స కేంద్రం(డిస్ట్రిక్ట్ అర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్) 2015 సంవత్సరం జనవరిలో రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఏర్పాటు చేసింది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. అప్పట్లో ఈ భవన నిర్మాణం జరగలేదు. వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భవన నిర్మాణ పనులు ప్రారంభమై గత సంవత్సరం మే చివర్లో ప్రారంభమైంది. అంత వరకు ఈ కేంద్రాన్ని పెద్దాసుపత్రిలోని చిన్నపిల్లల విభాగంలో కొనసాగించారు. కేంద్రం ప్రారంభంలో చాలా వరకు పోస్టులు ఖాళీగా ఉండేవి. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో మొత్తం పోస్టులన్నీ భర్తీ చేసింది. పిల్లలకు చికిత్సతో పాటు అవసరమైన ల్యాబోరేటరీ పరీక్షలు, ఆపరేషన్లు, కృత్రిమ అవయవాలు, చికిత్స, మందులు ఉచితంగా అందజేస్తున్నారు. ఇటీవల కర్నూలుతో పాటు నంద్యాల, ఆదోని లోనూ బాలల సత్వర చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే ఈ కేంద్రాల్లో కేవలం చికిత్స మాత్రమే అందిస్తున్నారు. పలు పోస్టులు కూడా ప్రస్తుతం ఖాళీ ఏర్పడటం గమనార్హం.


బాలల సత్వర చికిత్స కేంద్రం

ప్రతి సంవత్సరం 17వేల మంది దాకా చికిత్స

కర్నూలుతో పాటు నంద్యాల, ఆదోనిలోని బాలల సత్వర చికిత్స కేంద్రాల్లో ప్రతి సంవత్సరం 17వేల మంది దాకా చిన్నారులు చికిత్స పొందుతున్నారు. ఇందులో కర్నూలులో ప్రతిరోజూ 40 నుంచి 50 మంది, ఆదోనిలో 20 నుంచి 25 మంది, నంద్యాలలో 30 నుంచి 35 మంది చికిత్స పొందుతున్నారు. అప్పుడే జన్మించిన శిశువుల నుంచి 18 ఏళ్లలోపు పిల్లలకు పుట్టుకతో వచ్చిన 30కి పైగా జబ్బులకు ఇక్కడ చికిత్స అందిస్తున్నారు.

ఐదేళ్లలో చికిత్సలు ఇలా..

కేసులు	2020-21	2021-22	2022-23	2023-24	2024-25
కొత్త కేసులు	8,549	7,627	8,570	7,979	5,370
పాత కేసులు	8,739	7,797	8,761	7,926	4,358
మొత్తం	17,288	15,424	17,331	15,905	9,728

ఇలా గుర్తించి రెఫర్ చేస్తారు..

- జిల్లాలోని 18 ఏళ్లలోపు పిల్లల్లో పుట్టుకతో వచ్చిన వైకల్యాలు, వ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులను ప్రాథమికంగా గుర్తిస్తారు.
- ఈ మేరకు ఆయా కేంద్రాలు, పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోని అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, అధ్యాపకులకు అవసరమైన శిక్షణ ఇచ్చారు.
- ఆయా వ్యాధులకు సంబంధించి లక్షణాలున్న పిల్లలను ప్రాథమికంగా గుర్తించి కర్నూలు, ఆదోని, నంద్యాలలోని బాలల సత్వర చికిత్స కేంద్రాలకు పంపుతారు.
- ముందుగా ఆయా ప్రాంతాల వారు ప్రాథమికంగా కర్నూలు, ఆదోని, నంద్యాలలోని బాలల సత్వర చికిత్స కేంద్రాల్లో చికిత్స చేయించుకుని మెరుగైన వైద్యం, ఆపరేషన్ల కోసం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలిస్తున్నారు.
- ఇక్కడికి కర్నూలు జిల్లాతో పాటు నంద్యాల, అనంతపురం, ప్రకాశం, తెలంగాణ జిల్లాల నుంచి చిన్నారులను వారి తల్లిదండ్రులు చికిత్స కోసం తీసుకొస్తున్నారు.

చిన్నారులకు ఎంతో మేలు



బాలల సత్వర చికిత్స కేంద్రాల్లో పుట్టుకతో వచ్చే జబ్బులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం. అవసరమైన వారికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని నిపుణులైన వైద్యుల వద్దకు పంపి చికిత్స, ఆపరేషన్లు నిర్వహించేలా చేస్తున్నాం. ఈ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు చికిత్స, మందులతో పాటు అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు, కృత్రిమ అవయవాల పంపిణీ చేస్తున్నాం. కర్నూలులోని కేంద్రం ఫోన్ నెంబర్ 08518–251043. – షేక్ మహ్మద్ ఇర్ఫాన్, బాలల సత్వర చికిత్స కేంద్రం, మేనేజర్

తలసేమియా ముందే గుర్తించాం



నేను ఓ ప్రైవేటు కంపెనీలో సర్వీస్ అడ్వైజర్‌గా పనిచేస్తున్నా. మా బాబు బబీష్ వర్మకు సంవత్సరం ఏడు నెలల వయస్సు. బాబు 8 నెలలోనే జన్మించాడు. దీంతో పాటు పుట్టినప్పుడు బరువు 1.5 కిలోలు మాత్రమే. అందుకే రెగ్యులర్‌గా ప్రభుత్వాసుపత్రిలోని చిన్నపిల్లల విభాగంలో చికిత్స చేయిస్తున్నాం. ఈ క్రమంలో ఆరో నెలలో బాబుకు రక్తం తక్కువగా ఉందని తెలుసుకొని పరీక్షలు చేయించగా తలసేమియా నిర్ధారణ అయ్యింది. ప్రాథమిక దశలో ఉండటంతో రెగ్యులర్‌గా మందులు వాడుతున్నాం. – పృథ్వీరాజ్, కర్నూలు

బాబు మాట్లాడుతున్నాడు



నా భార్యకు రెండవ కాన్పులో మగపిల్లవాడు జన్మించాడు. ఇప్పుడు నాలుగున్నరేళ్లు. మొదట్లో మాటలు సరిగ్గా వచ్చేవి కావు. బాలల సత్వర చికిత్స కేంద్రానికి వచ్చాక మార్పు కనిపించింది. బాబు ప్రవర్తనలో మార్పు కనిపించడంతో పాటు మాట్లాడుతున్నాడు. – కె.సుధాకర్, కలమందలపాడు, కర్నూలు

బనగానపల్లె జెడ్పీ పాఠశాల బాలికలు భళా


విద్యార్థినులను అభినందిస్తున్న బనగానపల్లె జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం,ఉపాధ్యాయ బృందం

- జాతీయ ఉపకార వేతనాలకు ఒకే పాఠశాల నుంచి 16 మంది విద్యార్థినులు ఎంపిక
- అభినందించిన ఉపాధ్యాయ బృందం

బనగానపల్లె రూరల్: స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు జాతీయ ఉపకార వేతన పరీక్షల్లో సత్తా చాటారు. ఏకంగా 16 మంది విద్యార్థినులు అర్హత సాధించి ఔరా అనిపించారు. ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థినులు 8వ తరగతి విద్యార్థినులు ఎస్.ఉషారాణి, డి.హాసియా, డి.సబిహ, కె.జ్ఞానేశ్వరి, ఎం.హారిక, బి.మధుమీనాక్షి, ఎస్.ఫిర్‌దోస్‌బీ, ఎస్.సుమయా, జీఎస్ ప్రియాంక, సి.రజిత, టి.జ్యోతి, ఏ.ఇమాన్, ఎస్.శ్రీలత, ఎం.వనితకుమారి, పీబీ మధుచందన, పి.జ్వాలను సోమవారం పాఠశాలలో హెచ్‌ఎం బాలగంగధర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఇంటర్ వరకు నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఉపకార వేతనం అందుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు వి.షహనాజ్‌బేగం, ఫిర్దోస్, లక్ష్మీనారాయణమ్మ, వరలక్ష్మి, లలితమ్మ, లక్ష్మీదేవి, నీలిమ పాల్గొన్నారు.


జగన్(ఫైల్) ఇల్లూరు కొత్తపేట పాఠశాల విద్యార్థి

- మండలంలోని ఇల్లూరుకొత్తపేట బీసీ వసతి గృహం విద్యార్థి కె జగన్ ఉపకార వేతనానికి అర్హత సాధించినట్లు వార్డెన్ మునిరాజు తెలిపారు. విద్యార్థి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడన్నారు.

జిల్లాలో 110 నాటుసారా ప్రభావిత ప్రాంతాలు

- నేర తీవ్రతను బట్టి ఎ, బి, సి కేంద్రాలుగా విభజన
- నవోదయంలో భాగంగా నిర్మూలనకు ఎక్సైజ్ అధికారుల కార్యాచరణ

కర్నూలు: జిల్లాలో 110 గ్రామాలను నాటుసారా ప్రభావిత ప్రాంతాలుగా ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. నేర తీవ్రతను బట్టి ఆయా ప్రాంతాలను ఎ, బి, సి కేంద్రాలుగా విభజించారు. నవోదయంలో భాగంగా ఆయా ప్రాంతాల్లో సారా తయారీని పూర్తిగా నిర్మూలించేందుకు ఎక్సైజ్ అధికారులు కార్యాచరణను రూపొందించారు. డిప్యూటీ కమిషనర్ నుంచి కానిస్టేబుల్ స్థాయి వరకు ఆయా నాటుసారా ఉన్న గ్రామాలు, ప్రాంతాలను దత్తత తీసుకున్నారు. ఆయా గ్రామాల క్రైం ప్రొఫైల్, నేరస్తుల వివరాలు సేకరించి మొదటి 30 రోజులు ఆయా గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. కళాజాత వంటి సాంస్కృతిక ప్రదర్శనతో ప్రజల్లో నాటుసారా నిర్మూలనపై చైతన్యం కల్పించడం.. గ్రామస్థాయిలో సర్పంచు, వీఆర్వో, ఎక్సైజ్ కానిస్టేబుల్ సభ్యులుగా సమన్వయ కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. అలాగే మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీపీ, పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్, ఎక్సైజ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్, జిల్లాస్థాయిలో కలెక్టర్, ఎస్పీ, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్, డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్ సభ్యులుగా ఉండి నవోదయం అమలుకు నిరంతరం సమీక్షించేలా కార్యాచరణ రూపొందించారు. ఇందులో భాగంగా పాత నేరస్తులను బీఎన్ఎస్ఎస్ 128 అండ్ 129 కింద బైండోవర్ చేసి వారిలో సత్ప్రవర్తనకు కృషి చేయనున్నారు. రెండవ దశలో నాటుసారా స్థావరాలపై దాడులు, అమ్మకం, విక్రయాలు మానని వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయడం, సత్ప్రవర్తన కలిగి సారా వ్యాపారాన్ని వదిలేసే వారికి ప్రత్యామ్నాయ ఉపాధి చూపించడం నవోదయం ముఖ్య ఉద్దేశ్యమని ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు తెలిపారు. రెండు మాసాల్లో (60 రోజుల్లో) జిల్లాలో ఎక్సైజ్ నేరాలకు సంబంధించిన కేసులు నమోదు కాకపోతే కలెక్టర్ ఆధ్వర్యంలో ఉన్న జిల్లా స్థాయి కమిటీ కర్నూలును నాటుసారా రహిత జిల్లాగా ప్రకటించేలా కార్యాచరణ రూపొందించినట్లు సుధీర్ బాబు తెలిపారు.

మహానందికి బ్రహ్మోత్సవ వైభవం

- గోపూజలతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు
- సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణం
- ఉదయం నుంచి రాత్రి వరకు విశేష పూజలు


నందీశ్వరునికి కంకణ ధారణ చేస్తున్న పండితులు


గోపూజ చేస్తున్న ఈఓ శ్రీనివాసరెడ్డి దంపతులు


ధ్వజారోహణ చేస్తున్న దృశ్యం

మహానంది: మహానందిలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, ఉప ప్రధాన అర్చకులు వనిపెంట జనార్ధశర్మల ఆధ్వర్యంలో రుత్వికులు, పండితులు ఉదయం నుంచి రాత్రి వరకు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం గోమాతను పట్టువస్త్రాలతో, రత్నవైఢూర్యాలు కలిగి పాపిడి బిళ్లను అలంకరించి రాజగోపురం ముందు నుంచి ఆలయంలోని కల్యాణమండపం వరకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. గణపతిపూజ, రాజగోపురానికి రాజోపచారం, పుణ్యహావాచనం, కంకణ ధారణ, కల్యాణ దీక్షలో స్వామి, అమ్మవారికి దీక్షా ధారణలు చేశారు. మధ్యాహ్నం త్రిశూల పూజ, సాయంత్రం పుట్టమన్ను, ఆవుపాలతో కలిసి తీసుకొచ్చి అంకురార్పణ పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ ఏఈఓ ఎరమల మధు, సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు మహానంది శ్రీనివాసులు, శ్రీశైలం శ్రీనివాసులు(చిన్నా) పాల్గొన్నారు.

సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణం

మహానందిలోని ధ్వజస్తంభం వద్ద సోమవారం రాత్రి ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సకలదేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణం పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా చేపట్టారు. ధ్వజస్తంభానికి నంది చిత్రంతో కూడిన పటాలాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ఉత్సవాలు వైభవంగా ప్రారంభమైనట్లు ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఆకట్టుకుంటున్న పుష్పాలంకరణ

మహానంది క్షేత్రంలో శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన పుష్పాలంకరణ ఆకట్టుకుంది. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షిస్తూ పుష్పాలంకరణపై సూచనలిస్తూ పనులు చేయించారు.

దర్గాకు పోటెత్తిన మల్లన్న భక్తులు


ముర్తుజావలి దర్గా వద్ద భక్తజన సందోహం

ఆత్మకూరురూరల్: నల్లమల అడవుల్లోని నాగలూటి చెంచు గూడెంలో ఉన్న ముర్తుజావలి దర్గాకు మల్లన్న భక్తులు పోటెత్తారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలం చేరుకునేందుకు పాదయాత్రగా వెళ్తున్న వేలాది మంది భక్తులు నల్లమల అడవుల్లో అడుగు పెట్టగానే గోషాయి కట్టపై ఉన్న ఆంజనేయ స్వామిని తొలి దర్శనం చేసుకుంటారు. ఆ తర్వాత నాగలూటిలో ఉన్న ముర్తుజావలి దర్గాను సందర్శించి టెంకాయ సమర్పించి కాసేపు సేద తీరి ముందుకు కదులుతున్నారు. అనంతరం నాగలూటి వీరభద్రాలయం, మెట్ల వద్ద ఉన్న అమ్మవారికి పూజలు నిర్వహించుకుంటూ శ్రీశైలానికి చేరుకుంటున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతిచెందిన రాజు

ఆదోని అర్బన్: ఆస్పరి మండలం పెద్దహుల్తి గ్రామానికి చెందిన బోయ రాజు(33) ఆదివారం రాత్రి అనుమానాస్పద స్థితిలో ఇంట్లో ఉరేసుకుని మృతిచెందారు. హెడ్ కానిస్టేబుల్ మద్దిలేటి తెలిపిన వివరాలు.. పెద్దహుల్తి గ్రామానికి చెందిన భీమప్ప కుమారుడు బోయ రాజు ఆదోని ఆర్టీసీ బస్టాండు వద్ద దుకాణం బాడుగకు తీసుకుని బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండు రోజుల క్రితం రాజు భార్య భాగ్యమ్మ పుట్టినిల్లు కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా మోకా గ్రామంలో జరిగిన జాతరకు దంపతులు కలిసి వెళ్లారు. అక్కడ భార్య పుట్టినింట్లో గొడవ పడ్డారు. ఇద్దరూ కలిసి తిరిగి ఆదోనికి చేరుకున్నారు. ఆదివారం రాత్రి అందరూ నిద్రించిన సమయంలో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ముగ్గురు కుమారులు ఉన్నారు. కాగా తన కుమారుడి ఆత్మహత్యపై అనుమానం ఉందని తండ్రి భీమప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

దేవరకు వచ్చి..

ఆస్పరి: మద్దికెరకు చెందిన నెట్టేకంటయ్య (36) గ్రామ దేవతల దేవర నిమిత్తం ఆస్పరి మండలం ముత్తుకూరు గ్రామానికి వచ్చి అనుమానాస్పద స్థితిలో మృత్యువాత పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఈనెల 17 నెట్టేకంటయ్య పెద్దమ్మవ్వ, సుంకులమ్మవ్వ దేవర నిమిత్తం ముత్తుకూరు గ్రామం లోని సోదరి ఇంటికి వచ్చాడు. 19న మధ్యాహ్నం వరకు సోదరి ఇంటి వద్దే ఉన్నారు. అనంతరం బయటకు వెళ్లి సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో సోదరి బంధువులు తెలిసిన చోటల్లా వెతికారు. స్వగ్రామంలోనూ ఆరా తీశారు. సోమవారం పొలాల్లో మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి సోదరుడు ప్రభాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రామాంజనేయులు తెలిపారు.

కుందేలు కాను... ఊత కర్రను



ఇక్కడ చిత్రంలో కనిపిస్తున్న కర్రను చూస్తే చెవులు నిక్కబొడిచి నిలుచున్న కుందేలులా కనపడుతుంది కదా... నిజమే శ్రీశైలం వెళ్లే పాదయాత్రికుల కోసం చెంచులు వెదురు పొదలను తవ్వి వంపుతిరిగిన వెదురు వేర్లను జాగ్రత్తగా పాలిష్ చేసి ఊత కర్రగా మారుస్తుంటారు. సృజనాత్మకతకు నిలువెత్తు రూపాలైన ఆదిమ గిరిజనులైన చెంచులు ఆ కర్రలను కూడా తమదైన రీతిలో కళాత్మకంగా తయారు చేస్తుంటారు. కొన్ని పాముపడగలా కనిపిస్తే, మరికొన్ని కుందేలు తలలా కనిపించేలా వారి చేతుల్లో రూపుదిద్దుకుంటున్నాయి. ఆత్మకూరు అటవీ డివిజన్‌లోని నాగలూటి వీరభద్రాలయం వద్ద కుందేలు తలలాంటి చేతికర్ర విక్రయిస్తూ ఓ చెంచు యువకుడు కనిపించాడు. – ఆత్మకూరు రూరల్

150 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

నందికొట్కూరు: పట్టణ పరిధిలోని నీలిషికారిపేటలో నాటు సారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన 150 లీటర్ల బెల్లం ఊటను సోమవారం ధ్వంసం చేసినట్లు నందికొట్కూరు ఎక్సైజ్ ఎస్ఐ జఫ్రుల్లా తెలిపారు. నీలిషికారి జానుభా నుంచి 50 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. అనంతరం నీలిషికారిపేట విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి నాటుసారా జోలికి వెళ్లొద్దంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

వాగుపై వంకర 'కంకర' రోడ్లు


వాగులో పైపులు వేసిన దృశ్యం

పాణ్యం: కంకర ఫ్యాక్టరీకి మూడి సరుకు తెచ్చేందుకు ఒక చోట, ఫ్యాక్టరీలో ఉత్పత్తిని బయటకు తీసుకెళ్లేందుకు మరో చోట తమ్మరాజుపల్లె గ్రామ సమీపంలోని వాగును పూడ్చివేసి రహదారి వేశారు. వాగు దాదాపు 20 అడుగుల వెడల్పు ఉండగా సిమెంట్ పైపులను వేసి తగ్గించారు. రాతి కట్టడం కట్టి ఔరా అనిపించారు. ఫ్యాక్టరీ యజమాని వాగులో ఇష్టానుసారంగా గోడలు కట్టడంపై విమర్శలు వస్తున్నాయి. ఈ విషయమై మైనర్ ఇరిగేషన్ డీఈఈ నాగన్న మాట్లాడుతూ.. మొదటి సారి వాగును పూడ్చినప్పుడు హెచ్చరికలు జారీ చేశామన్నారు. వాగులో పైపులు వేసుకొని గోడ కడుతున్నారనే విషయం మా దృష్టికి రావడంతో రెవెన్యూ సిబ్బందికి చెప్పి స్థలానికి పంపించామన్నారు. నోటీసులు ఇచ్చి నిర్మాణాలు జరగకుండా వాగులో నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా తొలగిస్తామని పేర్కొన్నారు. కాగా.. మైనర్ ఇరిగేషన్ డీఈఈ నాగన్న హెచ్చరికలను ఫ్యాక్టరీ యజమాని పెడచెవిని పెట్టినట్లు తెలుస్తోంది. అంతేగాక అధికార పార్టీ నాయకుల నుంచి అధికారికి ఫోన్లు చేయించి వాటిని తొలగించకుండా అలాగే ఉంచినట్లు సమాచారం.

కోర్టు ఆదేశాలతో తహసీల్దార్‌పై కేసు నమోదు

ఆత్మకూరురూరల్: గతంలో ఆత్మకూరు తహసీల్దార్‌గా పనిచేసిన ప్రకాశ్ బాబు, సిబ్బందిపై నందికొట్కూరు జేఎఫ్‌ఎంసీ (ఎఫ్ఏసీ ఆత్మకూరు) ఆదేశాల మేరకు సీఐ రాము కేసు నమోదు చేశారు. తహసీల్దార్ ప్రకాష్ బాబుతోపాటు అప్పట్లో ఆత్మకూరులో పని చేసిన డిప్యూటీ తహసీల్దార్ లోకేశ్వరి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులుపై కేసు నమోదైంది. ఆత్మకూరు శివారులో ఉన్న తన భూమిని అక్రమంగా తెలంగాణాకు చెందిన పింజరి రాజు పేరుతో ఆన్‌లైన్ చేస్తూ రెవెన్యూ రికార్డులను తారుమారు చేశారన్న అభియోగంతో డి.మోదిన్ సాహెబ్ అనే వ్యక్తి కోర్టుకు వెళ్లారు. దీంతో కేసు నమోదు చేసి చార్జ్‌షీట్ దాఖలు చేయాలని కోర్టు ఆత్మకూరు అర్బన్ పోలీసులను కోర్టు ఆదేశించింది. పింజరి రాజుతో పాటు తహసీల్దార్ ప్రకాష్‌బాబు (ప్రస్తుతం బేతంచర్లలో పని చేస్తున్నారు), డిప్యూటీ తహసీల్దార్ లోకేశ్వరి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులను నిందితులుగా చేరుస్తూ అర్బన్ సీఐ రాము ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.